క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా పలు ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ సింగయ్య, డీఈ ఎ.రామయ్య శుక్రవారం తెలిపారు. శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 17వ తేదీన జరిగే రథోత్సవానికి ఆటంకం లేకుండా విద్యుత్ స్తంభాలు మార్పులు చేయడంతో పాటు ఇతర చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

రెంటచింతల: మండలంలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ షేక్ మస్తాన్‌వలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెంటచింతల, పాలువాయి, మంచికల్లు, జెట్టిపాలెం సబ్ స్టేషన్‌ల పరిధిలో సరఫరా ఉండదన్నారు.

మాచర్ల: పట్టణంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏఈ కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. లైనుల మరమ్మతుల నిమిత్తం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలగనుందని చెప్పారు.

మాచవరం: నేడు మండల పరిధిలోని అన్ని విద్యుత్ సబ్ స్టేషన్లలో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ భగవాన్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న మెప్మా మార్కెట్



పిడుగురాళ్ల : మెప్మా అర్బన్ మార్కెట్ కార్యక్రమాన్ని పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద శుక్రవారం ఏర్పాటు చేశారు. పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. మహిళలు తయారు చేసిన బుట్టలు, స్వీట్లు, రొట్టెలు, జూట్ బ్యాగ్‌లు ప్రదర్శించి విక్రయించారు.

కార్డుల కోసం నమోదు చేసుకోవాలి



మాచవరం: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతు విశిష్ట గుర్తింపు నమోదుకు అవకాశం ఉందని ఏడీఏ బి. శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కె.రామమ్మ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

రెంటచింతల: ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే మండల రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ శాఖ అందచేయనుంది. మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకొక్క రైతుకు 2.50 ఎకరాలకు సరిపడా విత్తనాలు.ఇస్తామన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

మాచర్ల రూరల్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఒక్క అర్జీని నిర్దేశిత సమయంలో పరిష్కరించి తగు సమాధానాన్ని అందించాలని ప్రత్యేకాధికారి గబ్రూ నాయక్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖాధికారులతో ఆయన మాట్లాడారు. అర్జీలు రాగానే సత్వరం స్పందించాలని సూచించారు. సంబంధిత అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు బి. కిరణ్ కుమార్, షేక్ బాషా, ఎంఈఓ అల్లి సురేష్, ఆర్ఐ ఇంటూరి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వమోహన్‌రెడ్డికి ఘన నివాళి

పిడుగురాళ్ల : కామ్రేడ్ విశ్వమోహన్‌రెడ్డి సేవలు ఎనలేనివని జనసాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివికుమార్ అన్నారు. పట్టణంలోని లెనిన్ నగర్‌లోని స్తూపం వద్ద విశ్వమోహన్‌రెడ్డి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దివికుమార్ మాట్లాడుతూ... విశ్వమోహన్‌రెడ్డి పిడుగురాళ్ల చేరుకునే నాటికి 25కిపైగా నవలలు రాసి పెద్ద రచయితల్లో ఆయన పేరు కూడా నిలబడిందన్నారు. కార్యక్రమంలో రైతుకూలి సంఘం నాయకుడు నీలాద్రి రాంబాబు, మరియమ్మ, నాగేశ్వరరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం



మాచర్ల రూరల్ : నివాళులర్పిస్తున్న తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, ప్రత్యేకాధికారి గబ్రూ నాయక్, ఎంపీడీఓ ఫణికుమార్ తదితరులు



దాచేపల్లి: నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నేతలు



రెంటచింతల: పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎస్ఈ వెంకటరమణ

దాచేపల్లి : పూలే జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. నారాయణపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన ఈ వేడుకల్లో పూలే చిత్రపటానికి నేతలు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. సమసమాజ స్థాపన కోసం పూలే ఎంతో కృషి చేశారని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభాని చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కోట కృష్ణ, నాయకులు మందపాటి రమేష్‌రెడ్డి, కొప్పుల సాంబయ్య, షేక్ జాకీర్‌హుస్సేన్, కొమెరబత్తిన విజయ్‌కుమార్, దాచేపల్లి సైదారావు, కొలా జంపాలరెడ్డి, జక్కా అశోక్, వేముల శ్రీహరి, జంగిలి నరసింహారావు, జంగాల సింగరయ్యయాదవ్, గుదూరి గోవర్ధన్‌రావు, పసుపులేటి నరసింహారావు, రాచకొండ కోటయ్య తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పల్నాడు బలహీనవర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నాయకులు షేక్ షరీఫ్, గద్దల వేదమణి, మాశెట్టి పుల్లారావు, బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద ఏపీ జెన్‌కో నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్టు ఎస్ఈ కె. వెంకటరమణ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెంటచింతల గ్రామంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పూలే చిత్ర పటానికి స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.మోహన్, బీజేపీ మండల అధ్యక్షుడు బోయ నాగిరెడ్డి, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు ఎన్. శ్రీనివాస్‌లు నివాళులు అర్పించారు. ఈఈలు సుబ్రమణ్యం, నాగరాజు, ఏడీఈ రత్తయ్య, జయశంకర్, గిరిబాబు, ఏఈలు జయపాల్, సుజాత, సరిత, ఏఓ లతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో....

ఫిరంగిపురం: పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.శివయ్య, మండవ చిన నరసింహారావు, కె. కోటేశ్వరరావు, కె.రామకోటేశ్వరరావు, బి.సతీష్‌బాబు, జి, చంద్రం



వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



రెంటచింతల: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న మోహన్, నాగిరెడ్డి

,పి.థామస్, పి.దివ్య, ఆరె పున్నారెడ్డిలు పాల్గొన్నారు.

మాచర్ల: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే సేవలు చిరస్మరణీయం అని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము కిషోర్‌లు అన్నారు. పట్టణంలోని లాడ్జీల సెంటర్‌లో శుక్రవారం పూలే జయంతిని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వారు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాచర్ల వాసు, ఏపీటీఎఫ్ నాయకులు పోతురాజు, సునీల్ కుమార్, కందుకూరి మధుబాబు, అనిల్ కుమార్, లక్ష్మి, సుధాకర్, భారవి, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాలకు మార్గదర్శి

గురజాల రూరల్: బలహీన వర్గాల భవితకు మార్గదర్శి జ్యోతిరావు పూలే అని మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, వేముల చలమయ్య, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, కె.అన్నారావు, ఎం. ప్రసాద్‌రావు, షేక్ నాసర్ సైదా, జక్కా సత్యం, జక్కా రమణ తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: పూలే త్యాగాలు ఎనలేనివని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ ఎం.అర్జున్‌నాయక్, ఎంపీడీఓ కె. సరోజినీదేవి, ఎస్ఐ సీహెచ్ నాగార్జున, డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఓ చిన వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాచర్ల: పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నరసింహారావు, వేణుబాబు, కిశోర్ తదితరులు

మాచర్ల రూరల్: భావితరాలకు స్ఫూర్తి ప్రదాత పూలే అని, ఆయన సేవలను మరువరాదని తహసీల్దార్ బి. కిరణ్ కుమార్, ప్రత్యేకాధికారి గబ్రూ నాయక్, మున్సిపల్ కమిషనర్ డి వేణుబాబు, ఎంపీడీఓ ఫణికుమార్‌లు అన్నారు. శుక్రవారం పూలే జయంతిని పురస్కరించుకొని నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ అల్లి సురేష్, వ్యవసాయాధికారి లక్ష్మారెడ్డి, తహసీల్దార్ బాషా, ఆర్ఐ ఇంటూరి అనిల్ కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సమానత్వమే ఊపిరిగా...

పిడుగురాళ్ల: మహిళాభివృద్ధికి జ్యోతిరావు పూలే విశేష కృషి చేశారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ.. పూలే సేవలు యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యవిభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, పట్టణ, మండలశాఖ అధ్యక్షులు చింతా రామారావు, చల్లా పిచ్చిరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కొమెర వెంకటేశ్వర్లు, ఇంగ్లీష్ మీడియం విద్య పరిరక్షణ వేదిక సమన్వయకర్త దాచినబోయిన ఏడుకొండలు, కౌన్సిలర్లు కొక్కెర శ్రీను, మాదాల కిరణ్‌కుమార్, అప్పిరెడ్డి, జూలకంటి శ్రీనివాసరావు, బాలస్వామి, శెట్టిపల్లి పూర్ణ, షేక్ మహ్మద్‌జానీ, నాయకులు దేవళ్ల నాగరాజు, కత్తెరపు వాసుదేవరెడ్డి, మాజీ ఎంపీపీ గండికోట కోటేశ్వరరావు, పట్టణ యూత్ కన్వీనర్ మందా సుధీర్, మందా జాషువా, చల్లగుళ్ల స్వామి, తురక నాగేశ్వరరావు, చిట్టిబోయిన నరసింహారావు, చింతల జానకిరామయ్య, షేక్ జానీబాషా, మాచర్ల వెంకట్, జంగాల బాబు, సంధ్యాల బాబు, మందా ప్రేమ్‌రాజ్, రామకోటేశ్వరరావు, ఎస్టీ సెల్ పట్టణ కన్వీనర్ కాంత్రగుంట కన్నయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ తాలే మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.



రెంటచింతల: పూలే చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు



మాచర్ల: పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి తదితరులు

జాతీయ అవార్డుకు శ్రీనివాసరెడ్డి ఎంపిక



పెదకూరపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారానికి పల్నాడు జిల్లా 75త్యాళ్ళూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. తెలంగాణ పుడమి సాహితీ వేదిక ఎంపిక చేసినట్లు శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. జాతీయ స్థాయిలో విద్యా వైద్యం, సాహిత్యం, సాంస్కృతిక, సామాజిక, క్రీడలలో విశేష సేవలు అందించిన వారికి ఈ పురస్కారం అందిస్తారని తెలిపారు. శ్రీనివాసరెడ్డి ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, వ్యాసకర్తగా, సామాజిక రంగంలో చేస్తున్న కృషికి ఈ అవార్డు అందించనున్నారు. ఈ నెల 13న నల్గొండలో అవార్డు అందించనున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డిని ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు ఎ.తిరుమలేష్, ఆర్.శ్రీనివాసరెడ్డి, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య, పల్నాడు జిల్లా ఫ్యాప్టో కో చైర్మన్ టి.చంద్రయ్య, ఎస్ఎంసీ చైర్మన్ పున్నారావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయులు



వెలంగణి జ్యోతి / సీతామహాలక్ష్మి / కూచిపూడి సరిత / షేక్ బాజి / రెబ్బవరపు శిరీష

పెదకూరపాడు: పెదకూరపాడు మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ వెలంగణి జ్యోతి, తెలుగు, సోషల్ ఉపాధ్యాయులు సీతామహాలక్ష్మి, కూచిపూడి సరిత, కాకతీయ పబ్లిక్ స్కూల్ హిందీ ఉపాధ్యాయుడు షేక్ బాజి, మందపాడు శ్రీనివాస హైస్కూల్ సోషల్ ఉపాధ్యాయురాలు రెబ్బవరపు శిరీషలు ఎంపికయ్యారు. వీరికి ఈ నెల 13న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందించనున్నారు. విద్యాభివృద్ధికి, సామాజిక సేవలకు గాను వారు ఈ అవార్డు అందుకోనున్నారు.

400 మందికి వైద్య పరీక్షలు

అచ్చంపేట: స్థానిక జెడ్పీ గెస్ట్ హౌస్ వద్ద కాటూరి హాస్పిటల్స్ వైద్యులు నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ భాయి, రమేష్ నాయక్ దంపతులు ప్రారంభించారు. శిబిరంలో జనరల్ వైద్యసేవలతో పాటు కార్డియాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్టీ, అప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ తదితర విభాగాలలో వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని ఎంపికచేసి గుంటూరులో కాటూరి హాస్పిటల్‌లో శస్త్రచికిత్స చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో రోగులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



వ్యాపారులు సమయపాలన పాటించాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ టి.తులసి

క్రోసూరు: క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని అన్ని లైసెన్సు మద్యం దుకాణాల నిర్వాహకులు సమయపాలన పాటించాలని, మద్యాన్ని ఎమ్మార్పీకే విక్రయించాలని ఆ శాఖ సీఐ టి.తులసి కోరారు. శుక్రవారం మూడు మండలాల్లోని లైసెన్సు మద్యం దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్, స్టాక్ నిల్వ, రికార్డులు పరిశీలించారు. మద్యం ధరలు గురించి దుకాణానికి వచ్చే కస్టమర్లను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మార్పీ ధరల పట్టికలు పెట్టారో లేదో, దుకాణాల వద్ద సిట్టింగులు ఏమైనా ఉన్నాయా పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రస్తున్నట్లు సమాచారం ఉంటే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.



దేవాలయ భూములకు వేలం



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం భూములకు బహిరంగ వేలం పాటను శుక్రవారం నిర్వహించినట్లు ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. రెంటచింతల గ్రామానికి చెందిన సన్నెగంటి సిద్దయ్య అనే రైతు 6 ఎకరాలను మూడేళ్ల పాటు ఏడాదికి రూ. 70 వేలకు కౌలు హక్కు పొందారన్నారు. మొత్తం 63.58 ఎకరాల మెట్టభూమికి గాను మిగిలిన 57.38 ఎకరాలకు నిర్వహించిన వేలం పాట వాయిదా పడినట్లు వెల్లడించారు. సూపర్ వైజర్లు పూర్ణచంద్రరావు, లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అన్నదానం



పిడుగురాళ్ల : ముస్లిం యూత్, సూఫీ మసీద్ బృందం ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి శుక్రవారం పేద యాచకులకు అన్నదాన కార్యక్రమం వీరి ఆధ్వర్యంలో జరుగుతుంది.

8 మంది జూదరుల అరెస్ట్

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో శుక్రవారం అమరావతి పోలీసులు దాడి చేసి 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎండ్రాయిలో జూదమాడుతున్న 8 మందినీ, వారి వద్దనున్న రూ.4,200 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు అంకితభావం అవసరం



వీడ్కోలు వేడుకల సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థినులు

అమరావతి: ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు లక్ష్యం మీద దృష్టి సారించి పట్టుదల, అంకిత భావంతో విద్యాభ్యాసం చేయాలని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ధరణికోట వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళాశాల ధాన్యకటక జేఈఈ, నీట్ అకాడమీలో ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపాల్ పోకల శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని, సాకారం చేసుకోవటానికి నిరంతర కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యవర్గ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉద్యోగ సంఘం నేతలకు సన్మానం

దాచేపల్లి : నారాయణపురంలోని ఆర్అండ్‌బీ బంగ్లా సెంటర్‌లోని ఎస్టీయూ కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎల్. వెంకట్రామిరెడ్డి, ఉగాది పురస్కార గ్రహీత, కవి కొసూరి రవికుమార్ సన్మాన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, రవికుమార్‌లను ఘనంగా సన్మానించారు. ఎంఈవో మణికుమార్, ఎస్టీయూ నాయకులు మందా రాజశేఖర్, సోము వెంకటరమణ, చెట్టిపాగు ఏసురత్నం, చెట్టిపాగు రాములు తదితరులు పాల్గొన్నారు.



వెంకట్రామిరెడ్డి, రవికుమార్‌లను సన్మానిస్తున్న దృశ్యం

సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి

సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్

నకరికల్లు: గ్రామాల్లో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు ప్రజల సహకారం అవసరమని సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ ప్రజలకు సూచించారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలోని ప్రజలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో వివాదాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. మహిళలను గౌరవించడం మగపిల్లలకు తల్లిదండ్రులు నేర్పించాలన్నారు. ప్రయాణ సమయంలో రోడ్డుపై అతివేగంగా వెళ్లవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ చల్లా సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



చీమలమర్రిలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ పి.కిరణ్ . పక్కన ఎస్ఐ సురేష్

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం

సత్తెనపల్లి: అన్ని అవయవాల కన్నా కళ్ల ప్రధానమైనవని, అలాంటి కళ్లను నిర్లక్ష్యం చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. అందరికీ నాణ్యమైన కంటి వైద్యం అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్తెనపల్లి ఆధ్వర్యంలో డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ కంటి ఆస్పత్రి సహకారంతో శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రిటైర్డ్ ఎంప్లాయిస్, వారి కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ప్రసాద్, రామారావు, చంద్రయ్య, జోజిరెడ్డి, సైదులు, కమలాకర్‌రావు తదితరులు ఉన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది